క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి పల్లకీ ఉత్సవం



అయ్యప్ప స్వామి జన్మ తిథి సందర్భంగా గ్రామంలో పల్లకీ ఉత్సవం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శుక్రవారం స్వామి జన్మ తిథి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు చేబ్రోలు సుబ్రహ్మణ్యం, పరస రత్నాజీరావు ఆధ్వర్యంలో ఆలయం వద్ద నుంచి గోదావరి వరకు స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి నదిలో పుణ్య స్నానం ఆచరించి అనంతరం గోదావరి జలాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో మైగాపుల సత్యనారాయణ, కలిశెట్టి సన్యాసి నాయుడు, కేదారీశ్వర్, కొమ్మిరెడ్డి నారాయణ రావు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీదేవికి పూజలు



తాళ్లపూడిలో శ్రీలక్ష్మీజయంత్యుత్సవంలో హోమం, పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో లక్ష్మీ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం, వివిధ పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, అష్టోత్తర కమల హోమం, ప్రధాన హోమాలు, శ్రీపుష్పయాగ అలంకారం, హోమం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

కమనీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



లక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు: స్థానిక ధనలక్ష్మీ ఆలయంలో శుక్రవారం శ్రీలక్ష్మి జయంతి, హోలీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం కనుల వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.గున్నేశ్వరరావు గుప్త దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులు స్వామివారు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్టీల్ ప్లాంట్ నిర్వహణకు నిధులు కేటాయించాలి

నిడదవోలు : స్థానిక ఇందిరానగర్‌లో ఐఎఫ్‌టీయూ అభ్యుదయ పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు, గనులతో పాటు సరుకు రవాణాకు అవసరమైన రైల్వే వ్యాగన్‌లను ప్రభుత్వాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రవ్వ సురేష్‌కుమార్, పులుగు చైతన్య, మహేష్, యలగాడ రాజ్‌పాల్, బవిరిశెట్టి నాగేంద్ర, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మిర్చి రైతుకు నష్టాల ఘాటు

- ఫైరును పీడించిన ఎర్రనల్లి, తెల్ల పేను
- గణనీయంగా తగ్గిన దిగుబడి
- ఎకరాకు సుమారు 2 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటాల్ ఎండుమిర్చి ధర రూ. 50 వేలు
- పల్లంట్ల ఎండు మిరపకాయలకు గిరాకీ



దేవరపల్లి మండలం పల్లంట్లలో కల్లంలో ఆరబెట్టిన ఎండు మిరపకాయలు

దేవరపల్లి: మిరప పంట దిగుబడి లేక రైతులు దిగులు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి, కౌలు సొమ్ము రావడం కష్టంగా ఉందని మిర్చి రైతులు వాపోతున్నారు. పూత దశలో తోటలకు తెల్ల పేను, ఎర్రనల్లి సోకడం వల్ల పంటకు నష్టం వాటిల్లిందని సాగుదారులు వివరించారు. ఎన్ని మందులు వాడినా డబ్బులు ఖర్చు తప్ప తెగుళ్ల అదుపులోకి రాలేదని రైతులు తెలిపారు. ఏటా సంక్రాంతికి మిరప పంటలో పూత, పిందె ముమ్మరంగా ఉంటుందని, ఈ ఏడాది పూత వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో పిందె ఏర్పడలేదని రైతులు వివరించారు. ఏపుగా తోటలు పెరిగాయి కాని మిరప దిగుబడి ఆశించనంతగా లేదని రైతులు వాపోతున్నారు. మిర్చిసాగు కష్టతరంగా ఉందని, ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోందన్నారు. పదేళ్ల క్రితం పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు మిరప సాగు చేసేవారని, ప్రస్తుతం 200 ఎకరాలకు సాగు పరిమితమైందని రైతులు తెలిపారు. వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

పల్లంట్ల ఎండుమిర్చికి మంచి గిరాకీ

పల్లంట్ల, కురుకూరు కిలోమీటర్ దూరంలో గల జంట గ్రామాలు. రెండు గ్రామాల రైతులు ఎండు మిరప సాగుకు ప్రసిద్ధి. దాదాపు దశాబ్దకాలంగా ఇక్కడి రైతులు మిరప పంట సాగు చేస్తున్నారు. పచ్చి మిరపకాయలను కోయకుండా మొక్కకు ఉంచి ఎండు మిరపకాయలు తయారైన తరువాత కోసి ఎండబెట్టి వినియోగదారులకు విక్రయిస్తుంటారు. దేశవాళీ రకం ఎండుమిర్చి సాగుకు రెండు గ్రామాలు ప్రసిద్ధి చెందాయి. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ దేశవాళీ మిరపకాయలను చాలామంది కొనుగోలు చేస్తారు.

రైతుల నుంచి నేరుగా కొనుగోలు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు నేరుగా ఈ రెండు గ్రామాల్లోని మిరప కల్లాల్లోకి వచ్చి నచ్చిన ఎండు మిరపకాయలను కొనుగోలు చేసి తీసుకువెళతారు. వేసవికాలంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండు మిరపకాయల సీజన్ ఉంటుంది. ఈ మూడు నెలలు వినియోగదారులతో రెండు గ్రామాలు సందడిగా ఉంటాయి. ముఖ్యంగా మహిళలు వచ్చి నచ్చిన కాయలను అవసరం మేరకు కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది ఎండుమిర్చి కొనాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. దిగుబడి గణనీయంగా తగ్గడంతో ఈ ఏడాది ఎండు మిరపకాయలకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఎండు మిర్చి ఎకరాకు సుమారుగా 2 క్వింటాళ్లు దిగుబడి వస్తోంది. క్వింటాల్ ఎండుమిర్చి ధర రూ. 50 వేలకు పైగా ఉంది. ఈ ఏడాది మిర్చి పంటకు తెగుళ్లు అధికంగా సోకడంతో రైతులు మిర్చి సాగుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు. ఎండుమిరప దిగుబడి తగ్గడంతో రైతులు ఎకరాకు సుమారు రూ.లక్షకు పైగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.



పల్లంట్లలో మిరపకాయలు లేకుండా ఏపుగా పెరిగిన పైరు

దేశవాళీ ఎండు మిరపకాయలకు గిరాకీ

సాధారణంగా దేశవాళీ ఎండు మిరపకాయల కొనుగోలుకు మహిళలు మొగ్గుచూపుతారు. ఈ రకం ఎండు మిరపకాయల కారం ఏడాది పొడవునా నిల్వ ఉండడంతో పాటు ఘాటు తక్కువ ఉంటుంది. ఆవకాయ, మాగాయ వంటి నిల్వ పచ్చళ్లు పెట్టేందుకు దేశవాళీ ఎండు మిరపకాయలను వాడతారు. దూరప్రాంతాల్లోని బంధుమిత్రులకు కూడా ఇక్కడి నుంచి ఎండు మిరపకాయలను స్థానికులు కొనుగోలు చేసి పంపుతారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఎండు మిర్చి ఎక్కువగా పండిస్తారు.

మిరప తోటలకు తుపాను దెబ్బ

ఈ ఏడాది మిరప తోటలకు తుపాను దెబ్బతగిలింది. తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఎండు మిరపకాయలకు గిరాకీ ఏర్పడింది. దిగుబడులు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి పంటకు ఎన్నడూలేని గిరాకీ ఏర్పడింది. కిలో ఎండు మిర్చి ప్రస్తుతం రూ.500 నుంచి రూ.550 ధర పలుకుతోంది. వీచి మిరప కాయలు (1,400 గ్రాములు) ధర ప్రస్తుతం రూ.750 నుంచి 900 ధర పలుకుతోంది. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో వీచి మిరప రూ.1,400 ధర పలికింది. అప్పుడు రైతులకు మంచి లాభాలు వచ్చాయి. రెండేళ్లుగా మార్కెట్లో ధర బాగున్నప్పటికీ దిగుబడి తగ్గిందని రైతులు తెలిపారు. 2022–23 సీజన్‌లో ముందుగా పూతకు వచ్చిన పంట దెబ్బతిన్నప్పటికీ ఫిబ్రవరిలో పండిన మిరప రైతులను గట్టెక్కించాయి. 2023–24 సీజన్‌లో ధర ఆశాజనకంగా ఉన్నప్పటికీ మిచాంగ్ తుపాను కారణంగా తోటలు దెబ్బతిని దిగుబడులు తగ్గినట్టు రైతులు తెలిపారు.

గుంటూరు మిర్చికి మొగ్గు

దేశవాళీ ఎండు మిరపకాయల ధర అందుబాటులో లేకపోవడంతో గుంటూరు, తెలంగాణలోని భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం జిల్లాల్లో పండించిన సన్నకాయల కొనుగోలుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. అక్కడ కాయలను వ్యాపారులు గ్రామాలకు తీసుకువచ్చి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కిలో రూ. 200 నుంచి రూ.250 ధరకు విక్రయిస్తున్నారు. ధర అందుబాటులో ఉండడంతో ఎక్కువ మంది వినియోగదారులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. జీ–4 రకం మిర్చిని ఆయా ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. ఈ రకం కాయలు ఘాటు ఎక్కువగా ఉండి, కారం ఎక్కువ రోజులు నిల్వ ఉండని పరిస్థితి. అయినా చేసేది లేక చాలామంది వాటినే కొనుగోలు చేసి సరిపెట్టుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులు చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటున్నట్టుగా పల్లంట్ల మిర్చి పేరుతో ఇతర ప్రాంతాల నుంచి మిర్చిని తీసుకువచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

మూడేళ్లుగా చీడపీడలు అధికం



నాలుగు ఎకరాల్లో మిరపతోట వేశాను. ఎకరాకు రూ. లక్ష పైగా పెట్టుబడి పెట్టాను. తోటలు పూత, పిందె దశలో పేను, ఎర్రనల్లి సోకడంతో పూతలు దెబ్బతిన్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా పైరు తేరుకోలేదు. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి రావచ్చు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఎకరానికి సుమారు రూ.1.50 లక్షల వరకూ నష్టం వచ్చే పరిస్థితి నెలకొంది. మూడేళ్లుగా తోటలకు చీడపీడలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి.

– పిచ్చుకల వెంకటేశ్వరరావు, రైతు, పల్లంట్ల

మిరప సాగు గిట్టుబాటు కావడం లేదు



మిర్చి సాగు గిట్టుబాటు కావడంలేదు. ముదర కాపు దెబ్బ తింది. లేత కాపు వస్తేనే ఒడ్డున పడతాం. ఫిబ్రవరిలో కాసిన పిందెలు ఏప్రిల్ నాటికి పంట చేతికి వస్తోంది. 2022–23 సీజన్‌లో లేత కాపు రైతులను ఆదుకుంది. ఎకరాకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. మిరప రైతులు కోలుకోవడం కష్టం. ఎర్రనల్లి, పేను ఎక్కువగా సోకింది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు.

– వల్లభనేని కిషోర్, రైతు, పల్లంట్ల

గృహనిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం



గృహనిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న డీఈఈ టి. శేఖర్‌బాబు, ఏసీ ధర్మారావు

దేవరపల్లి: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలను సత్వరం పూర్తి చేసుకోవాలని ఆ శాఖ అధికారులు లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి మండలంలో అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందజేస్తున్నట్టు గృహనిర్మాణ శాఖ డీఈఈ టి. శేఖర్‌బాబు శుక్రవారం తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తిచేయని లబ్ధిదారులకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందజేస్తున్నట్టు డీఈఈ శేఖర్‌బాబు తెలిపారు. మే నెలాఖరుకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని గ్రామాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో 5,480 మంది లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం అందించనున్నట్టు ఆయన చెప్పారు. దీని నిమిత్తం నియోజకవర్గానికి రూ.27.75 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులు 5,290 మంది, ఎస్టీలు 199 మంది లబ్ధిదారులు ఉన్నట్టు ఆయన చెప్పారు. దేవరపల్లి మండలంలో ఎస్సీ, బీసీ లబ్ధిదారులు 2,986 మంది, ఎస్టీ లబ్ధిదారులు 78 మంది ఉండగా, రూ.15.52 కోట్లు మంజూరైనట్టు ఆయన వివరించారు. గోపాలపురం మండలంలో ఎస్సీ, బీసీ లబ్ధిదారులు 1,031 మంది, ఎస్టీ లబ్ధిదారులు 85 మంది ఉండగా, రూ. 5.64 కోట్లు , నల్లజర్ల మండలంలో ఎస్సీ, బీసీ లబ్ధిదారులు 1,324 మంది ఉండగా, ఎస్టీలు 36 మంది ఉన్నారు. వీరికి రూ.6.59 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు. వివిధ దశల్లో గృహనిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయిన గృహాలకు అదనపు ఆర్థికసాయం అందజేస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలకు అదనంగా మరొక రూ. 50 వేలు ఆర్థికసాయం మంజూరు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. గృహనిర్మాణం ప్రారంభించిన వెంటనే నిధులు విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన వివరించారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



దేవరపల్లి మండలం యర్నగూడెం జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులు

దేవరపల్లి: 2024–25 విద్యా సంవత్సరానికి ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. దేవరపల్లి మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, రెండు ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేవరపల్లిలో అంబటి సత్యనారారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూలు, శ్రీచైతన్య, భాష్యం స్కూల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు, చిన్నాయగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 630 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 396 మంది విద్యార్థులు మొత్తం 1,026 మంది పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో 450 మంది బాలురు, 576 మంది బాలికలు ఉన్నారు. దేవరపల్లిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 571 మంది రెగ్యులర్, 32 మంది కంపార్ట్‌మెంట్ విద్యార్థులు పరీక్ష రాయన్నారని మండల విద్యాశాఖ అధికారులు ఎం. తిరుమలదాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. యర్నగూడెం జెడ్పీ హైస్కూలు కేంద్రంలో 247 మంది, చిన్నాయగూడెం జెడ్పీ పాఠశాల కేంద్రంలో 208 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి నిర్వహణాధికారులను, పర్యవేక్షకులను నియమించినట్టు ఎంఈఓ అప్పారావు తెలిపారు.

నేటి నుంచి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



బ్రాహ్మణగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయం



హోమం నిర్వహణకు యజ్ఞశాల పందిరి సిద్ధం

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ రాజరాజేశ్వరి సరస్వతి అమ్మవార్ల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో గ్రామస్తులు, దాతలు సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15,16వ తేదీల్లో యాగశాల ప్రదక్షిణం, యాగశాల ప్రవేశం తదితర పూజలు, హోమాలు, గ్రామోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.17న విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీలక్ష్మీ రాజరాజేశ్వరీ, సరస్వతి శిఖర శిలాధ్వజయంత్ర ప్రతిష్ఠాపన, ప్రధమారాధన, పీఠారోహణ, కళావాహనం పూజా కార్యక్రమాలు, భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి అనురాధ

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మవారిని కొవ్వూరు 9వ అడిసినల్ జిల్లా జడ్జి అనురాధ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి అనురాధ కుటుంబ సభ్యు లు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ పర్యవేక్షణలో జడ్జి అనురాధకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రాజానగరం: తొర్రేడులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారని ఎస్సై మనోహర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.81 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారందరూ రాజమహేంద్రవరం, సీతానగరం ప్రాంతాలకు చెందిన వారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచామన్నారు.

శాస్త్రోక్తంగా కామ దహనం



చివటంలో కలప, చెక్కవస్తువులను మంటలో వేసి దహనం చేస్తున్న గ్రామస్తులు

ఉండ్రాజవరం: మండలంలో చివటం గ్రామంలో గురువారం రాత్రి శాస్త్రోక్తంగా కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమకు అక్కరకు రాని కలప, చెక్క వస్తువులను మంటలో వేసి దహనం చేసారు. సుమారు 100 ఏళ్లకు పైగా ఈ సంప్రదాయం గ్రామంలో కొనసాగుతోంది. గ్రామస్తులు చెబుతున్న వివరాల ప్రకారం వేసవికాలంలో తరుచూ గ్రామంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునేవని, వాటిని అరికట్టడానికి అగ్నికి మొక్కుబడిగా కామ దహనం నిర్వహించేందుకు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. నాటి నుంచి హోలి పౌర్ణమి రోజున గ్రామస్తులంతా గ్రామ ప్రధాన కూడలిలో తొలుత రావిచెట్టు కొమ్మను పాతి పెట్టి, ఆ కొమ్మ చుట్టూ దేవుని ఊరేగించి చెక్క వస్తువులను వేసి మంట వేస్తామని తెలిపారు. ఈ కామ దహనం మొదలు పెట్టినప్పటి నుంచి గ్రామంలో అగ్నిప్రమాదాలు ఆగిపోయినట్లు స్థానికులు తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల వాణిజ్య విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్నొవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. మూడు రోజులు జరిగే ఈ వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్ బాబు సహకారం, మార్గదర్శకత్వం ద్వారా ఈ వర్క్‌షాప్ కార్యరూపం దాల్చిందన్నారు. డ్రోన్ టెక్నాలజీ విస్తృత అవకాశాలను పరిశీలించేందుకు అకడమియా, పరిశ్రమను ఒకచోట చేర్చడంలో ఆయన పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఏయూ ఐసీడీటీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ఎం రావు మాట్లాడుతూ ఐసీడీటీ అభివృద్ధి, చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. విపత్తు నిర్వహణతో సహా అనేక రంగాల్లో డ్రోన్ సాంకేతికత వినియోగం ఆవశ్యకతను తెలిపారు. వర్క్‌షాప్‌లో బీబీఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొని డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఆర్ట్స్ కళాశాల, ఐసీటీడీ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. దీనిపై ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, ఏయూ ఐసీటీడీ అధ్యక్షుడు డాక్టర్ ఓఆర్ రావు సంతకాలు చేశారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సి.కోమల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రతిమ, డాక్టర్ పి.సునంద, డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు: మహిళా చైతన్యంతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్, ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం యూటీఎఫ్ సహాధ్యక్షురాలు ఎం.విజయ గౌరి అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్య వక్తగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాల్లో సమానం ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ్ కుమారి మాట్లాడుతూ మహిళలకు సమాజం, కుటుంబం సహకారాలు అందించాలన్నారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఈ.శ్రీమణి, ఎస్.భవాని, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జరీనా, టి.తులసి, సీనియర్ నాయకులు టి.సావిత్రి, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి బేబీరాణి, ఆశా సంఘం నాయకురాలు నాగమణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

35 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

నల్లజర్ల: 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉద్యోగులకు 35 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని జిల్లా రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేసారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో పల్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ 2018 జూలై నుంచి మరణించిన విశ్రాంత ఉద్యోగులందరికీ రావాల్సిన బకాయిలు వారి వారసులకు అందించాలని డిమాండ్ చేసారు. సమావేశానికి పీఎస్ ప్రసాద్, పప్పు వెంకటరామారావు, ఎస్ఎం ఆలీసాహెబ్, కొప్పు ఏసురత్నం, ఐవీ సత్యం, ఎస్.బాలయ్య, లక్కు తులసమ్మ, కొప్పు ఏసురత్నం, లక్కు తులసమ్మ పాల్గొన్నారు.